క్లుప్తంగా

చాముండేశ్వరి ఆలయానికి రూ.50 వేల విరాళం



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: కుప్పం మండలం కృష్ణాపురం వద్ద వెలసిన శ్రీ చాముండేశ్వరి దేవి ఆలయంలో ఎమ్మెల్సీ భరత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆయన ఆలయ కుంభాభిషేకం పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం అభివృద్ధికి రూ.50 వేలు, సర్పంచ్ సైదానాసీర్ రూ.20 వేలు విరాళంగా ఇచ్చారు. అమ్మవారు కుప్పం ప్రజలను చల్లగా చూడాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్సీ చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుప్పంరూరల్: కుప్పం పట్టణంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా కుప్పం, గుడుపల్లె మండలాల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని రెస్కో ఏడీ ఈ ప్రభాకర్ అన్నారు. దీనికి తోడు జేబీఏ, ఆర్‌బీఏ, సాఫా కంపెనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, వినియోగదారులు అంతరాయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనుల కారణంగా మండల పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ హేమచంద్రుడు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

రామకుప్పం: మండలంలోని పెద్దతండా పంచాయతీ పరిధిలో ఉన్న బండకొత్తూరుకు చెందిన చంపానాయక్, 89 పెద్దూరు పంచాయతీ ఆరిమానుపెంట గ్రామానికి చెందిన సునీల్ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలిసి ఎమ్మెల్సీ భరత్ స్థానిక సర్పంచ్‌లు మోహన్‌నాయక్, మల్లిక ద్వారా మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. మృతుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు.

మసీదు సభ్యుల నిరసన

పుంగనూరు: పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఓ మసీదు సభ్యులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ కార్యదర్శి అతిక్‌బాషా మాట్లాడుతూ 1947 చట్టాల మేరకు ప్రార్థన మందిరాల స్వరూపం ఏవిధంగా ఉందో, అదే విధంగా కొనసాగించాలని చట్టం నిర్దేశిస్తోందన్నారు. కానీ అందుకు విరుద్ధంగా ఢిల్లీలో 600 ఏళ్ల కిందట నిర్మించిన పురాతన జన్నత్‌వాలీ మసీదును కూల్చివేయడం అప్రజాస్వామ్యమన్నారు. దీనిపై పోరాటం చేస్తామన్నారు.

బంగారు నగలపై తక్షణ రుణం

సోమల: బంగారు నగలపై తక్షణ రుణం అందజేస్తున్నట్లు సోమల యూనియన్ బ్యాంక్ మేనేజర్ రంగస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రాముకు రూ.4,591 వేలు ఇస్తున్నామని ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాటర్ ప్లాంటు వితరణ



బొమ్మయ్యగారిపల్లె స్కూల్‌లో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాత తిరుపతి రెడ్డి

రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలకు సురక్షమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా కంపెనీ జిల్లా మేనేజర్ దాత తిరుపతి రెడ్డి వాటర్ ప్లాంటును శుక్రవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శుద్ధి చేసిన జలాన్ని తాగడం వల్ల వ్యాధులు రావన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.20 వేలు విలువ చేసే వాటర్ ప్లాంట్ అందించడం సంతృప్తికరంగా ఉందన్నారు. చిన్నగొట్టిగల్లు ఏడీ రమణయ్య, మండల పశువైద్యాధికారి శ్రీధర్, హెచ్‌ఎం హైమావతి పాల్గొన్నారు.

12న హాస్టల్ భవనం ప్రారంభం

రొంపిచెర్ల: రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో రూ.3 కోట్లతో నిర్మించిన మోడల్ స్కూల్ హాస్టల్ భవనాన్ని ఈ నెల 12న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సూచించారు. ఈ మేరకు వారపుసంతను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఓటర్లకు అవగాహన

అలాగే మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్రహారం పోలింగ్ కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బంది శుక్రవారం ఈవీఎంల ద్వారా ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సదుంలో సభకు హాజరైన మహిళలు



రొంపిచెర్ల: మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- అట్టహాసంగా వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ
- సీఎం రిలీఫ్ ఫండ్ కింద పలువురికి ఆర్థికసాయం అందజేత

సోమల: మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా నాలుగోవిడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత నిధులను 908 స్వయం సహాయక సంఘాలకు చెందిన 7,706 మంది మహిళలకు రూ.7 కోట్ల మెగా చెక్కును కలెక్టర్ షణ్మోహన్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. అనంతరం సీఎం రిలీఫ్‌ఫండ్ కింద నంజంపేటకు చెందిన శారదాకు రూ.5 లక్షలు, సోమల హరిజనవాడకు చెందిన శ్రీకాంత్‌కు రూ.1.5 లక్షలు, కందూరు ఊటుపల్లెకు చెందిన లోకేష్‌కు రూ.55 వేలు చెక్కులను పంపిణీ చేశారు. పీడీ తులసి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ జింకా వెంకటాచలపతి, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ పోకల అశోక్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర్, సయ్యద్ బాషా, మండల పార్టీ కన్వీనర్ గంగాధరం, ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి, ఏపీఎం శివయ్య పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు)లో..

పులిచెర్ల(కల్లూరు): ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని రాష్ట్ర అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో చేయూత పథకం ద్వారా అర్హులైన మహిళలకు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. అనంతరం మండలంలో 963 సంఘాల్లోని 8445 మంది సభ్యులకు 11.76 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..

ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను గల్లాబాబుకు రూ.2,10,000 లక్షలు, చంద్రశేఖర్‌కు రూ.30,000 వేలు, నిఖిల్‌కుమార్‌రెడ్డికి రూ.25,000 వేలు చొప్పున మంత్రి చేతుల మీదుగా అందజేశారు. టీటీడీ పాలక మండలి మాజీసభ్యులు పోకల అశోక్ కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్, మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, సర్పంచ్ రాణెమ్మ, పృథ్వీరెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, ఎన్ఎస్ రెడ్డి ప్రకాష్, పోకల చంద్ర, తహసీల్దారు వసంతలత, ఎంపీడీఓ సురేష్ బాబు, ఏపీఎం మధుసూదన్ పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: రాష్ట్రప్రభుత్వం వైఎస్సార్ ఆసరా నాలుగో విడతకు సంబంధించి మండలానికి సంబంధించి డ్వాక్రా సంఘాలకు సంబంధించి రూ.5.60 కోట్ల రుణమాఫీ నిధుల చెక్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందజేశారు. శుక్రవారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఆసరా సంబరాల కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఆసరా పథకం ద్వారా 583 స్వయం సహాయక సంఘాలలోని 5056 మంది సభ్యులకు రూ.5.60 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అనంతరం చెంచెంరెడ్డిగారిపల్లెకు చెందిన లక్ష్మమ్మకు రూ.20 వేలు, బండకిందపల్లెకు చెందిన షహీదా బేగంకు రూ.45 వేలు, సయ్యద్‌రబ్బానీకి రూ.50 వేలు, ముత్యాలమ్మ గుడివీధికి చెందిన దిల్షద్‌కు రూ.26 వేలు, పెద్దమల్లెలకు చెందిన విక్రమ్‌కు రూ.28 వేలు సీఎం సహాయ నిధి చెక్కులను ప్రదానం చేశారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, ఎంపీడీఓ రాజేంద్ర, తహశీల్దార్ షేక్ మొహిద్దీన్, ఏపీఎం బ్రహ్మానంద రెడ్డి, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, ఎంపీటీసీలు సిరాజున్నీసా, ఎన్.లక్ష్మి, రమణమ్మ, సర్పంచ్‌లు, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: మండల కేంద్రంలో 746 స్వయం సహాయక సంఘాలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరాకు సంబంధించిన రూ.8.23 కోట్ల మెగా చెక్కును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పంపిణీ చేశారు. అంతకుముందు సీఎం చిత్రపటానికి ఆయన పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. మహిళా సభ్యులను సన్మానించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైఎస్ ఎంపీపీలు అమరావతి, ధనుంజయరెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలోని మొరవమీదపల్లెకు చెందిన పరిణయరెడ్డికి రూ.62 వేలు, జాండ్రపేటకు చెందిన విక్రమ్‌కు రూ.2.50 లక్షలు, కారేవాండ్లపల్లెకు చెందిన ప్రత్యూషకు రూ.1.20 లక్షలు, కురవపల్లెకు చెందిన రూపశ్రీకి రూ.26 వేలు సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందించారు. మంత్రికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, ఎంపీడీఓ వరప్రసాద్ పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని 880 సంఘాల సభ్యులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం రూ.6.36 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువ నాయకులు మంత్రి పెద్దిరెడ్డి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిపెద్దిరెడ్డి, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్ కుమార్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామ్మూర్తి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, రెడ్డిప్రకాష్, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, ఎంపీడీఓ వెంకటేశు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాధవి, ఏపీఎం నరోత్తమరెడ్డి, తదితరులు ఉన్నారు.



చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సదుం: చెక్కు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



రొంపిచెర్ల: ఆసరా చెక్‌ను అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

చెరువు కట్ట ఫెన్సింగ్ పనుల తనిఖీ

కుప్పం: కుప్పం చెరువు కట్టపై చేపడుతున్న ఫెన్సింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ అన్నారు. శుక్రవారం ఫెన్సింగ్ నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. వేసవి ప్రారంభం కావడంతో పట్టణ వాసులకు వాకింగ్ చేయడానికి సౌకర్యంగా ఇంటర్ లాకింగ్ టైల్స్, పుట్‌పాత్‌ను వెడల్పు చేయడం జరుగుతుందన్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



చెరువు కట్టపై ఫెన్సింగ్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్

ఘన స్వాగతం



పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఆర్‌డీసీ క్యాడెట్ ఇళవరసన్‌కు స్థానిక కళాశాల అధ్యాపకులు శుక్రవారం ఘన స్వాగతం తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపికైన ఇళవరసన్ ప్రభుత్వ కళాశాలకు పేరు తెచ్చారని కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు తెలిపారు.

‘భారతరత్న’కు నిజమైన అర్హుడు పీవీ



మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: తెలుగువారి ముద్దుబిడ్డ, రాజకీయ చాణక్యుడు అయిన మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న లభించడం ఆనందదాయకమని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశ అభివృద్ధిలో నవశకానికి నాంది పలికిన పీవీ నరసింహారావుకు దక్కిన గౌరవం సముచితమని హర్షం వ్యక్తం చేశారు.

నేడు సదుంలో వైద్య శిబిరాలు

సదుం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ ఏడీసీటీ రాజారెడ్డి తెలిపారు. బెంగళూరు వైదేహి ఆస్పత్రి సిబ్బంది ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అలాగే స్థానిక పంచాయతీ కార్యాలయంలో శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ఉషారాణి చెప్పారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటు హక్కుపై అవగాహన



అవగాహన ర్యాలీ చేపడుతున్న వెలుగు సభ్యులు

వి.కోట: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకోవాలని వెలుగు సీసీ నాగరాజు సూచించారు. శుక్రవారం మండలంలోని కే.కొత్తూరులో వెలుగు వీఓ లీడర్లు, వెలుగు మహిళలు, సంఘమిత్రాలు ఓటుహక్కుపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ నాగరాజు, సంఘమిత్రా, వీఓ లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో రాహుకాల పూజలు



ప్రత్యేక పూజలు అందుకుంటున్న అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో సంప్రదాయరీతిలో అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, పూలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి , ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో పవిత్ర తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం మూడువేల మంది భక్తులకు ఉచిత అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఉచిత అన్నప్రసాదం నిర్వహణకు పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి రూ.5116 విరాళమిచ్చారు.

కృష్ణా జలాల పరిశీలన



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న ఆర్డీఓ

రామకుప్పం: మండలంలోని వర్తికుప్పం సమీపంలో హంద్రీ నీవా కాలువ ద్వారా వస్తున్న కృష్ణా జలాలను శుక్రవారం కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. పంపు హౌస్ నుంచి విడుదలైన నీరు కాలువ ద్వారా ప్రవహిస్తున్న తీరును, రామకుప్పం మండలం నుంచి నీటి ప్రవాహం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల రూట్‌మ్యాప్ సక్రమంగా ఉందా? లేదా ? అని రెవెన్యూ అధికారుల ద్వారా సమాచారం సేకరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అనుకూలంగా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శ్రీధర్, డిప్యూటీ తహసీల్దార్ దిలీప్, సర్వేయర్ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ



కుప్పంరూరల్: ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సీడీపీఓ



గంగవరంలో..

కుప్పంరూరల్: పిల్లలకు తప్పక అల్బెండోజోల్ మాత్రలు తప్పక వేయించాలని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణశ్రీ అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా భాగంగా రామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మాత్రలను వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలకు కడుపులో నులిపురుగులు చేరడం వల్ల రక్తహీనత, నీరసం, శారీరక, మానసిక ఎదుగుదల కోల్పోతారని చెప్పారు. వీటి నివారణ కోసమే ప్రభుత్వం ఆరునెలలకు ఒకసారి ఆల్బెండోజోల్ మాత్రలు వేయాలన్నారు.

గంగవరంలో..

గంగవరం: మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 19 ఏళ్లలోపు విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మబ్బువారిపేట ప్రాథమిక పాఠశాలలో వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో, అలాగే కస్తూర్బా బాలికల విద్యాలయంలో వైద్యాధికారి లహరి ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం..

పులిచెర్ల(కల్లూరు): నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె/సోమల/సదుం: చౌడేపల్లిలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సుబ్రమణ్యం, సోమలలోని స్థానిక ఎస్‌కేవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ ప్రదీప్‌కుమార్, సదుం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు గిరీషా ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది మింగించారు. మిగిలిన వారిని గుర్తించి ఈనెల 16వ తేదీన వారికి మాత్రలు పంపిణీ చేస్తామని వైద్యసిబ్బంది తెలిపారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని లింగాపురం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారి మురళి ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు.

యాత్ర–2ను వీక్షించిన ఎమ్మెల్యే



యాత్ర–2 సినిమాను వీక్షిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పలమనేరు: వైఎస్సార్ మరణం తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఎలా వేధించిందో, ఆపై ఆయన రాష్ట్రానికి సీఎం ఎలా అయ్యారో యాత్ర–2 మూవీలో చూపించారని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. పట్టణంలోని వీవీ మహల్‌లో శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి యాత్ర–2 సినిమాను వీక్షించారు.

మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

పలమనేరు: పట్టణ సమీపంలోని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో మార్చి 9న జరిగే జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కోర్టులో శుక్రవారం ఆయన కోర్టు పరిధిలోని పోలీసుతో మాట్లాడుతూ ఇందులో ఎటువంటి కేసులు అయినా రాజీ చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. రాజీ మార్గమే రాజమార్గం అన్నారు. లోక్ అదాలత్‌లో వెలువడే తీర్పు ఆఖరు అని, దానిపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం కూడా ఉండదన్నారు. రాజీ అయిన వారికి కోర్టుకు చెల్లించిన ఫీజును కూడా వాపసు చేస్తామని, కక్షిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.